క్లుప్తంగా

గ్యాన్ పోస్ట్ సేవలను ఉపయోగించుకోండి

తెనాలిఅర్బన్: తపాలాశాఖ నూతనంగా గ్యాన్ పోస్ట్ సేవలను ఈ నెల ఒకటి నుంచి ప్రారంభించిందని, అందరూ ఈ సేవలను ఉపయోగించుకోవాలని తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు స్పీడ్, రిజిష్టర్ పోస్టులు, రిజిష్టర్ పార్శిల్స్ వంటి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సామాజిక, సాంస్కృతిక, మతపరమైన, సాహిత్య పుస్తకాలను తక్కువ ధరకు ఇతర ప్రాంతాలకు చెరవేరడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలను కూడా తక్కువ ధరకే ఇతర ప్రాంతాలకు పంపిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

నేడు జనరల్‌బాడీ సమావేశం

తెనాలి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం సత్రం కమిటీ జనరల్ బాడీ సమావేశం ఆదివారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి కార్యదర్శి వక్కలగడ్డ గంగాధరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు శనివారం సాయంత్రం తెలియజేశారు. సభ్యులందరూ తమకు పంపిన జనరల్‌బాడీ సమావేశం నోటీసును తప్పక వెంట తీసుకురావాలని సూచించారు. సమావేశానికి సంబంధించి ఎలాంటి అపోహలను నమ్మొద్దని స్పష్టంచేశారు. దేవస్థానం సత్రం కమిటీని ఎన్నుకునే హక్కు కేవలం జనరల్‌బాడీ సభ్యులకు మాత్రమే ఉందన్నారు. కమిటీ ఉపాధ్యక్షుడు ఆకి అచ్యుతరావు, మాలేపాటి హరిప్రసాద్, గొడవర్తి శ్రీసాయి హరేరామ్, వుప్పల వరదరాజులు, గ్రంధి వెంకట విశ్వేశ్వరరావు, మద్దాళి శేషాచలం వీరితో ఉన్నారు.

నేడు విశ్రాంత ఐఏఎస్ అధికారికి అభినందన

తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత, తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ఏప్రిల్ నెల సర్వసభ్య సమావేశం జరగనుంది. తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహిస్తారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ 'కళారత్న' పురస్కారగ్రహీత నందివెలుగు ముక్తేశ్వరరావును ఈ సమావేశంలో సత్కరిస్తారు. సభ్యులంతా సమయపాలన పాటించి జయప్రదం చేయాలని డాక్టర్ రామ్‌చంద్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

బహిరంగంగా మద్యం తాగుతున్న ఆరుగురు అరెస్టు

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు టేకు తోట వద్ద బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం రాత్రి బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి, ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పేకాట, కోడి పందేలపై ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచి అరికట్టనున్నట్లు తెలిపారు.

11న 3 కే రన్, శారీ వాక్



చినకాకాని(మంగళగిరి): మాతృ దినోత్సవం సందర్భంగా ఈనెల 11న 3 కే రన్ నిర్వహించనున్నట్లు వీ వైబ్ సంస్థ అధినేత రాఘ వీణ తెలిపారు. శనివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘ వీణ మాట్లాడుతూ 3 కే రన్‌తో పాటు శారీ వాక్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేతన్నలను గౌరవించుకునేందుకు నేత చీరలు కట్టి మహిళలు పాల్గొనాలని ఆమె కోరారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు ఎస్ఆర్ఐ జంక్షన్ వద్ద గౌతమ బుద్ధా రోడ్డులో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నటు తెలిపారు. తొలుత శారీ వాక్, అనంతరం రన్ నిర్వహిస్తామని వివరించారు. అనంతరం నేతన్న చేతితో తయారైన వస్త్రాలతో మహిళల ఫ్యాషన్ షో, నృత్య నిపుణురాలు ప్రీతి సంగీత విభావరి ఉంటుందని తెలిపారు.

రేపు తాడికొండలో దివ్యాంగులు, వృద్ధులకు శిబిరం

తాడికొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వృద్ధులు, దివ్యాంగులకు పరికరాల పంపిణీ నిమిత్తం శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె. సమతావాణి ఒక ప్రకటనలో తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువ నున్న దివ్యాంగులకు, వయో వృద్ధులకు ఆర్టిఫిషియల్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలింకో), హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఉపకరణాలు, సహాయ పరికరాలు పంపిణీ కోసం ఈ శిబిరాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలోని దివ్యాంగులు, వృద్ధులు రేషన్ కార్డు, ఆధార్, రెండు ఫొటోలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఫొటోస్టాట్ కాపీలు, మొబైల్ నంబరుతో హాజరుకావాలన్నారు.

కమిటీ పరిణామాల్లో తీవ్ర ఉత్కంఠ

- నేడు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం సర్వసభ్య సమావేశం
- పోలీసు బందోబస్తు మధ్య నిర్వహణకు సన్నాహాలు
- హాజరు కావొద్దంటూ స్వయం ప్రకటిత పాలకవర్గం వేడుకోలు



శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ సర్వసభ్య సమావేశం నేటి ఉదయం 10.30 గంటలకు జరగనుంది. నూకల వెంకట వేణుగోపాల రావు అధ్యక్షుడిగా ఉన్న ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. మరోవైపు సమావేశం జరగకుండా చేసేందుకని స్వయం ప్రకటిత పాలకవర్గం శతవిధాలా ప్రయత్నిస్తోంది. దీంతో రూ.కోట్లాది ఆస్తులున్న శ్రీవాసవీ దేవస్థానం సర్వసభ్య సమావేశంపై పట్టణంలో ఉత్కంఠ నెలకొంది. గత నెల 13వ తేదీన జరగాల్సిన దేవస్థానం కమిటీ సర్వసభ్య సమా వేశం రసాభాస కారణంగా అనివార్యంగా వాయి దా వేసిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం మే నెల నాలుగో తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహణకు సభ్యులకు సమాచారం పంపారు. అలాగే మైకు పెట్టి పట్టణంలో ప్రచారం కూడా చేస్తున్నారు. పోలీసు బందోబస్తుతో పూర్తి భద్రత మధ్య సర్వసభ్య సమావేశం జరుగుతుందని కమిటీ ప్రకటించింది. అనారోగ్యంతో అమెరికాలో వైద్యచికిత్స పొందుతున్న కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు అనుమతితో ఉపాధ్యక్షుడు ఆకి అచ్యుతరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశం నోటీసు, ఆధార్ కార్డుతో సభ్యులు సమావేశానికి హాజరుకావాలని సూచించారు. అక్కడ సభ్యులు తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా కమిటీ ఎన్నిక ఆధారపడి ఉంటుందని, ఆ తీర్మానానికి అందరం కట్టుబడి ఉంటామని కూడా కమిటీ నాయకులు ఇంతకుముందు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కూటమి పార్టీ నేతల అండతో పెండేల వెంకట్రావు అధ్యక్షుడిగా దేవస్థానం కమిటీకి స్వయం ప్రకటిత పాలకవర్గం నాలుగో తేదీన జరగనున్న సర్వసభ్య సమావేశంపై బెంబేలెత్తుతోంది. ఆ సమావేశానికి చట్టబద్ధత లేదని, హాజరుకావొద్దంటూ ఆర్యవైశ్యులకు వాట్సాప్ సందేశం పంపుతున్నారు. మీడియా సమావేశంలోనూ ఇదే విషయం చెప్పటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గత నెల 13న సర్వసభ్య సమావేశాన్ని పెండేల వెంకట్రావు నేతృత్వంలో అడ్డుకోవటం తెలిసిందే. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్యులు కాని అన్య కులస్తులను ఇందుకు సమీకరించారు. ఆలయ కమిటీ విధిలేని పరిస్థితుల్లో సమావేశాన్ని వాయిదా వేయింది. మరోసారి ముందస్తు సమాచారమిచ్చి నిర్వహిస్తామని ప్రకటించారు. ఈలోగానే అంటే అదే నెల 15వ తేదీన పెండేల వెంకట్రావు ఆర్యవైశ్యుల్లో తనకు అనుకూలురను దేవస్థానం ప్రాంగణానికి ఆహ్వానించారు. దాదాపు 315 మందితో సంతకాలు చేయించి, పాలకవర్గాన్ని ఎన్నుకోవటం జరిగిందని ప్రకటించుకున్నారు. మళ్లీ ఇటీవల ప్రమాణస్వీకారం కూడా చేశారు. ఏదైనా కమిటీకి బైలా అంటూ ఒకటి ఉంటుంది. ఆ ప్రకారం సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసుకుని నిర్ణయించిన తేదీ ప్రకారం ఎన్నిక జరగాల్సి ఉంటుంది. అలాకాకుండా తమకు తామే రాసుకునే పాలకవర్గానికి ఏవిధంగా చట్టబద్ధత ఉంటుందని ఆర్యవైశ్యుల్లోనే ఎందరో ప్రశ్నించుకుంటున్నారు. ముందు ప్రకటించిన పాలకవర్గంలోనూ కొన్ని మార్పులు చేశారు. అందులో కొందరికి అసలు దేవస్థానం కమిటీలో సభ్యత్వమే లేదంటున్నారు. వాస్తవానికి స్వయంప్రకటిత పాలకవర్గానికి అర్హత ఉన్నట్టయితే పెద్దలను కూర్చోబెట్టి దేవస్థానం జమా ఖర్చులు తేల్చుకుంటారు. బ్యాంకు పుస్తకాలు, రికార్డులు, అమ్మవారి నగలతో సహా అన్నీ స్వాధీనం చేసుకుని, అప్పటి నుంచి కార్యకలాపాలను సాగిస్తుంటారు. అలాంటివేమీ జరక్కుండా మేం ఎన్నికయ్యామంటే ఎలా చెల్లుతుందని కమిటీ నాయకులు ప్రశ్నిస్తే సమాధానం లేదు. మరోవైపు సర్వసభ్య సమావేశం జరక్కుండా చేయాలనే ఉద్దేశంతో చట్టబద్ధత లేదనే ప్రచారం చేస్తున్నారు. అంటే సమావేశం జరిగితే తమకు ప్రతికూలంగా నిర్ణయం వస్తుందనే ఆందోళన ఉన్నట్టేనని భావిస్తున్నారు. దేవాలయానికి ఏదైనా సేవ చేసుంటే, సభ్యుల్లో తమకు బలం ఉన్నట్టయితే సమావేశానికి హాజరై తమకు అనుకూలంగా తీర్మానం చేసుకోవచ్చు కదాని పలువురు ఆర్యవైశ్యులే ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా ఆదివారం నాటి సమావేశమే ఇప్పుడు పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది.

9న సాంఘిక నాటిక ప్రదర్శన



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలెవరం గ్రామంలో ఈ నెల 9వ తేదీన శుక్రవారం రాత్రి 9 గంటలకు సింహమంటి చిన్నోడు సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్, గోల్డ్ డైరెక్టర్ గంపల శివనాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కొలెవరం గ్రామంలో నాటకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమకాలిన రాజకీయాలకు అర్థంపట్టే సింహమంటి చిన్నోడు నాటికను సరికొత్త కథనంతో రాజకీయ నాయకులకు కన్నువిప్పు కలిగే విధంగా రూపొందిస్తున్నట్లు చెప్పారు. కుటుంబ ప్రయోజనాలు కోసం కాకుండా సమాజం కోసం భావితరాల భవిష్యత్ కోసం నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బెల్లంకొండ వెంకట్, తాడిబోయిన నాగేశ్వరరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, పి.ఆశోక్ గజపతిరాజు, విజయసారథి బాబు, హైమారావు, రామరాజు, శ్రీనివాసరావు, శంకరరావు, పి.కొండంరాజు, గోపిరాజు, కమలి, సంధ్య పాల్గొన్నారు.

అమరావతిలో సినీ పరిశ్రమ ప్రస్తావన ఏదీ?

సినీ దర్శకుడు దిలీప్‌రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలిరూరల్: ప్రధాని మోదీ పునఃప్రారంభించిన అమరావతి రాజధానిలో సినిమా స్టూడియోల నిర్మాణానికి స్థలం ఎక్కడ కేటాయించారో ప్రభుత్వం తెలియజేయాలని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఏపీ 24 విభాగాల యూనియన్ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్ రాజా కోరారు. రూరల్ మండలం పెదరావూరు ఫిలిం స్టూడియోస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు ప్రధాని ముందు ప్రదర్శించిన ఆడియో విజువల్స్‌లో ఎక్కడా సినిమాపరిశ్రమ అభివృద్ధి ప్రస్తావన లేకపోవటం విచారకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి రూపకల్పనలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు విజన్ మహత్తరంగా ఉన్నప్పటికీ అందరికీ వినోదాన్ని అందించే సినిమా గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో ఎక్కడా ప్రస్తావించకపోవడం తీవ్ర మనస్తాపాన్ని కలిగించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణానికి కేటాయించిన వేలాది ఎకరాల భూమిలో స్వర్గీయ ఎన్టీఆర్ పేరుతో సినిమా స్టూడియోల నిర్మాణాలను శాశ్వత ప్రతిపాదికన చేపట్టాలని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిలకు దిలీప్ రాజా విజ్ఞప్తి చేశారు.ఎక్కడ రాజధాని ఉందో అక్కడే సినీపరిశ్రమ ఉంటే ఆంధ్ర ప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో దోహద పడుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆంధ్రులను మోసం చేసిన ప్రధాని మోదీ



మాట్లాడుతున్న నాసర్

తెనాలిఅర్బన్: ఆంధ్రులను ప్రధాని మోదీ మోసం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ విమర్శించారు. గాంధీనగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ అమరావతి పర్యటనలో రాష్ట్ర విభజన హామీలపై మాట్లాడకపోవడం బాధకరమన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ కూడా ఇవ్వలేదని ఎద్దేవ చేశారు. రాజధాని అమరావతి నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. మోదీ రాక వలన రాష్ట్రానికి ఒరిగింది ఏమిలేదని విమర్శించారు. పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసే 107, 108 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గుండు శివనాగరాజు, నాయకులు చెన్నూరి సాయి, తేజ, జయదీప్, నవీన్; వివేక్, శేఖర్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సంగీత కళాకారుడు పెద్దిరాజు హఠాన్మరణం



టీవీ పెద్దిరాజు (ఫైల్)

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్గాన్ కీ-బోర్డు విద్వాంసుడు 'ఇస్కఫ్' కార్యవర్గ సభ్యుడు, అభ్యుదయ కళాసమితి సంగీత దర్శకుడు టీవీ పెద్దిరాజు (51) శుక్రవారం రాత్రి పొద్దుపోయాక నెహ్రూ రోడ్డులోని స్వగృహంలో గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దిరాజు తండ్రి టి.రామారావు మ్యూజికల్ బ్యాండ్ పార్టీ-క్లారినెట్ విద్వాంసుడు. తండ్రి మరణం తర్వాత పెద్దిరాజు బ్యాండ్‌ను నడుపుతూ 50 మంది సంగీత కళాకారులతో రాష్ట్రంలో వందలాది ప్రదర్శనలిచ్చారు. 'ఇప్టా' ఆధ్వర్యంలో హైదరాబాద్, ఖమ్మం, విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర సభలో పుత్తడిబొమ్మ పూర్ణమ్మ నృత్యనాటిక, గోదాదేవి కళ్యాణం, పోస్టర్ నాటికలకు సంగీతాన్ని అందించారు. 'రక్తకన్నీరు' నాగభూషణం, మాదల రంగారావు ప్రశంసలందుకున్నారు. పట్టణానికి చెందిన సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ, సైదారావు, సదాశివ, సుబానితో సహా జిల్లాకు చెందిన సంగీత కళాకారులు, బ్యాండ్ పార్టీలు, స్థానిక ప్రముఖులు డాక్టర్ రావిపాటి వీరనారాయణ, డాక్టర్ కె.రామరాజు, బెల్లంకొండ వెంకట్, నాగప్రసాద్, అలపర్తి వెంకటేశ్వరరావు, ఉమాశంకర్ తదితరులు పెద్దిరాజు భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించారు. సినీసంగీత దర్శకులు కోటి, వాసూరావులు ఫోనులో పెద్దిరాజు కుటుంబసభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు. అనంతరం అంతిమయాత్ర ఘనంగా జరిగింది.

వృద్ధాశ్రమానికి రెండో అంతస్తు నిర్మాణం

విశ్రాంతి అధికారి డాక్టర్ సాంబశివరావు హామీ



వృద్ధాశ్రమంలో డాక్టర్ కత్తుల సాంబశివరావు

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమం భవనంపై రెండో అంతస్తు సమకూరనుంది. పట్టణానికి చెందిన విశ్రాంత అధికారి డాక్టర్ కత్తుల సాంబశివరావు రెండో అంతస్తును నిర్మించి ఇస్తానని హామీనిచ్చారు. శనివారం ఆయన ఆశ్రమాన్ని సందర్శించి ఆశ్రమంలోని వృద్ధులకు నిత్యావసర సరుకులను అందజేశారు. తన భార్య, కుటుంబసభ్యులను సంప్రదించి తన సొంత ఖర్చులతో వృద్ధుల సేవార్థం రెండో అంతస్తును కట్టించి ఇస్తానని చెప్పారు. దీనివల్ల ఆశ్రమంలోని వృద్ధులకు వెసులుబాటుగా ఉంటుందనీ, మరికొంతమంది వృద్ధులకు సేవలు అందించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ఆశ్రమ నిర్వాహకుడు వజ్రాల రామలింగాచారి మాట్లాడుతూ దాత డాక్టర్ కత్తుల సాంబశివరావు ఆశ్రమానికి అనేక పర్యాయాలు నిత్యావసరాలను సమకూర్చినట్టు చెప్పారు. మొదటి అంతస్తు నిర్మాణ సమయంలో కిటికీలను ఏర్పాటు చేసి, వర్షం నుంచి ఇబ్బందులను తొలగించారని గుర్తుచేసుకున్నారు. మళ్లీ ఇప్పుడు రెండో అంతస్తు నిర్మించి ఇస్తానని చేసిన ప్రకటనకు ధన్యవాదాలను తెలియజేశారు.

ఫ్యాక్టరీ భూములను సంరక్షించింది కార్మికులే



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ భూములను సంరక్షించింది కార్మికులే అని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కార్మికులకు మద్దతు తెలియజేశారు. వేలకోట్ల రూపాయల విలువైన ఏసీసీ భూముల్ని సంరక్షించింది కార్మికులే అన్నారు.

కులగణన అంశంపై రాజకీయాలు తగదు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు



మంగళగిరి టౌన్: జనగణనతో పాటు దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణన చేపడతామంటూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని పలు రాజకీయ పార్టీలు రాజకీయం చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు తెలిపారు. నగర పరిధిలోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో సగం మందికి పైగా ఉన్న ఓబీసీలకు కుల గణన వల్ల మేలు జరుగుతుందని తెలిపారు. కులగణన కోసం దశాబ్దాలుగా బీసీ సంఘాలతో పాటు వివిధ కుల సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఉద్యమిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలోని కేంద్రమంత్రి మండలి జనగణనతో పాటే జాతీయ స్థాయిలో సమగ్ర కుల గణనను కూడా చేయాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడాన్ని ఓబీసీ సమాజం హర్షిస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఓబీసీలు సంబరాలు జరుపుకుంటున్న వేళ, బీహార్ ఎన్నికల్లో విజయం కోసమే ఈ నిర్ణయం అంటూ ప్రతిపక్షాలు విమర్శించడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరామ్ బాబాజీ, ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, ఉపాధ్యక్షుడు వరప్రసాద్ పాల్గొన్నారు.

9న తాడికొండ మండల పరిషత్ సమావేశం

తాడికొండ: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 9న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.సమతావాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని సూచించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందని, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు తమ శాఖల పరిధిలోని ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఆమె తెలిపారు.

నేడు మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలో పర్యటన

తాడేపల్లి రూరల్: ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో ఆదివారం పర్యటించనున్నట్లు తాడేపల్లిలోని ఆయన కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో గల శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం పునఃప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ఫలతుష్షేక్ అష్రఫ్ ఫైజీ హాఫిజ హుల్లాహ్

మంగళగిరి టౌన్: ఉన్నత చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఫజీల తుష్షేక్ అష్రఫ్ ఫైజీ హాఫిజహుల్లాహ్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఈద్గా షాదీఖానాలో మదరసా ఆయిషా సిద్దిఖా 12వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అష్రఫ్ ఫైజీ హాఫిజహుల్లాహ్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా మదరసా వార్షికోత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని చక్కని ప్రతిభ కనబర్చడం హర్షణీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ప్రాపంచిక విద్యతో పాటు ధార్మిక విద్యను కూడా అభ్యసించేలా చూడాలని సూచించారు.

పొలాల్లో భూసార పరీక్షలు చేయాలి

ఏడీఏ ఎస్.ఉషారాణి



మట్టి నమూనాలు సేకరిస్తున్న రైతు సేవా కేంద్రం సిబ్బంది

తెనాలిటౌన్: రైతులు పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయశాఖ తెనాలి సహాయ సంచాలకులు ఎస్.ఉషారాణి సూచించారు. రూరల్ మండలం పెదరావూరు గ్రామంలో శనివారం రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలు చేయు విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏడీఏఎస్.ఉషారాణి, మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని పొలాల్లో మట్టి నమోనాలు సేకరించే ప్రక్రియపై పలు సూచనలు చేశారు. అనంతరం భూసార పరీక్షలు వల్ల జరిగే ప్రయోజనాలను వివరించారు. భూసార పరీక్షలు చేయించడం వలన పొలంల్లో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎంత మోతాదులో ఉన్నాయో తెలుస్తుందని చెప్పారు. సూక్ష్మపోషకాలు అయిన జింక్, ఐరన్ లోపాలను గుర్తించవచ్చని చెప్పారు. మట్టి నమోనాలను స్థానిక రైతు సేవా కేంద్రాలకు పంపిస్తే యార్డులోని ల్యాబ్ నందు పరీక్షలు నిర్వహించి ఫలితాలు తెలియజేస్తామని రైతులకు వెల్లడించారు. దీని వలన ఎరువుల వాడకం తగ్గుతుందని స్పష్టం చేశారు.

వేసవి దుక్కులు దున్నుకోవాలి

వేసవి దుక్కులు దున్నుకోవడం వలన నేలలో ఉత్తమ నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ నీటి మట్టం పెరుగుతుందని ఏవో ప్రేమ్‌సాగర్ తెలియజేశారు. ముందుగా దుక్కి దున్నడం వలన నేల కోతకు గురికాకుండా ఉంటుందని చెప్పారు. చేలలో ఉండే మొండి జాతి కలుపు మొక్కలను దుంపలతో సహా పెకిలించేలా దుక్కి దున్నుకోవాలని సూచించారు. తొలకరిలో దున్నడం వలన నేలలోకి నీరు బాగా ఇంకి భూమి గుళ్ళబారుతుందని చెప్పారు. అంతేకాకుండా గతంలో వేసిన పంట తాలూకు వ్యర్థాలు నేలలో కలిసి సేంద్రియ ఎరువుగా మారుతుందని వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి మహాసభల్లో పాల్గొనాలి

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి



ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి వలి

తెనాలిఅర్బన్: అఖిల భారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభలు ఈ నెల 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరుగుతాయని, అందరూ దీనిలో పాల్గొనాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి షేక్ వలి కోరారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం గాంధీనగర్‌లో శనివారం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభల్లో యువతలో సామాజిక స్పృహను పెంపొందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక నిరాకుశ పాలనను సభల్లో ఎండగట్టనున్నట్లు చెప్పారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతుందని, విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రధాని మోడీ చరిత్రహీనుడుగా మిగిలిపోతారన్నారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ కార్యదర్శి రాజేష్ బిల్లా, జిల్లా సహాయ కార్యదర్శి పాశం వెంకటేష్, నాయకులు కోలా శేఖర్, మన్నెం నరేంద్ర, శరత్, హేమంత్, రాము, తదితరులు పాల్గొన్నారు.

హేమలతకు నివాళి అర్పించిన మంద కృష్ణమాదిగ



హేమలత చిత్రపటం వద్ద నివాళి అర్పించిన కృష్ణమాదిగ

తెనాలి: భారత మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్‌రామ్ అనుచరుడు పమిడిపాగ రాజారావు సతీమణి, కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ సలహా మండలి మాజీ సభ్యురాలు ఆరుగొలను జాస్మిన్ మాతృమూర్తి హేమలత మరణం తీరనిలోటని ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. తెనాలికి చెందిన హేమలత ఏప్రిల్ 23న మృతిచెందారు. విషయం తెలిసిన మంద కృష్ణమాదిగ శనివారం రాత్రి చెంచుపేట, అమరావతి ప్లాట్స్‌లోని వారి స్వగృహానికి విచ్చేశారు. హేమలత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆరుగొలను జాస్మిన్‌కు తన సానుభూతిని తెలియజేశారు. బాబూ జగజ్జీవన్‌రామ్‌తో తొలినుంచీ సత్సంబంధాలు కలిగి, భారతదేశంలోనే తొలిసారిగా జగజ్జీవన్‌రామ్ విగ్రహాన్ని తెనాలిలో నెలకొల్పింది పమిడిపాగ రాజారావు కుటుంబమేనని కృష్ణమాదిగా ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. జాతిని చైతన్యపరచటంలో భర్తకు తోడుగా నిలిచిన హేమలత ధన్యురాలని అన్నారు. పలువురు ఎమ్మార్పీయస్ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ మేనేజర్‌గా విల్సన్

తెనాలిఅర్బన్: మున్సిపల్ మేనేజర్‌గా కెడబ్ల్యువో విల్సన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తణుకు మేనేజర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై తెనాలి వచ్చిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన ఆయన కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మిపతి రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు వివిధ విభాగాల అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.